క్లుప్తంగా

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

మంచాల: మండలంలోని తాళ్లపల్లిగూడలో కుకుడాల వెంకటేశ్వర రెడ్డి నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీటీసీ సభ్యులు ఎడ్మా నరేందర్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త.. ఇలా అయితే ఎట్లా?

పట్టించుకోని అధికారులు



రోడ్డు పక్కనే పడేసిన చెత్త

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ నుంచి సాహెబ్‌నగర్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కన చెత్త వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా డంపింగ్ యార్డ్‌లా మారింది. చుట్టూ పక్కల ఇళ్లలోని ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని, మున్సిపల్ అధికారులు ఎన్నిసార్లు చెప్పినా పెడ చెవిన పెడుతున్నారు. యథేచ్ఛగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తూ అపరిశుభ్ర వాతావరణానికి కారకులవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపేద ఇంటి నిర్మాణానికి చేయూత



సిమెంట్ పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద మహిళ రాములమ్మ ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టింది. డబ్బులు సరిపోక నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపేసింది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ రాములమ్మ ఇంటి నిర్మాణానికి సాయం అందజేస్తానని భరోసా ఇచ్చారు. మంగళవారం ట్రస్టు సభ్యులచే స్టీల్, సిమెంట్, తదితర మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు విశాల్, మల్లేష్‌యాదవ్, మహేష్, సజ్జుపాషా, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన అమంచ ఆచారి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, స్థానిక జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ ప్రియారమేశ్ కూడా రూ.3 వేలు అందజేసింది. పరామర్శించిన వారిలో సర్పంచ్ హరిచంద్‌నాయక్, ఉప సర్పంచ్ శ్రీశైలం, నాయకులు సాయిలు, పంతునాయక్ , బాబా, కుమార్, రాజు, శ్రీను తదితరులు ఉన్నారు.

పరామర్శ

తలకొండపల్లి: మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత బాలమైసయ్య తల్లి కాలె జంగమ్మ (90) మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డిలు చౌదర్‌పల్లికి వెళ్లి బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. జంగమ్మ మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం వ్యక్తిగతంగా భగ్‌వాన్‌రెడ్డి రూ. 10,000, ప్రభాకర్‌రెడ్డి రూ. 5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారిని పార్టీ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ కార్యదర్శి అంజయ్యగుప్తా, రవీందర్‌యాదవ్, డిగ్రీ కృష్ణ, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి , అజీం, నరేందర్, నరేష్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న కావలి నర్సింహ

త్యాగాల పునాదులపై పుట్టిన ఎర్ర జెండా

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ
- ఘనంగా సీపీఐ వార్షికోత్సవం

ఇబ్రహీంపట్నం రూరల్: త్యాగాల పునాదుల మీదే ఎర్రజెండా పుట్టిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నర్సింహ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన కావలి నర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి ఎన్నో వీరోచిత ఉద్యమాలు చేసింది సీపీఐ మాత్రమేనన్నారు. అనాడు బ్రిటీషులపై పోరాడి స్వాతంత్య్రం సాధించడంలో కీలక పాత్ర పోషించిందని చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో సీపీఐ అగ్రభాగాన నిలిచిందన్నారు. నాటి నుంచి నేటి వరకు కార్మిక , కర్షక , నిరుద్యోగుల పక్షాన నిలబడి పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నీలమ్మ, మాజీ సర్పంచ్ యాదయ్య, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, శ్రీశైలం, కృష్ణ,, యాదయ్య, రాజునాయక్, జంగయ్య, నర్సింహా, రామకృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.



తుర్కయంజాల్: సీపీఐ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

తుర్కయంజాల్: దేశానికి స్వాతంత్య్రం అనంతరం ఆర్థిక అసమానతలు, కార్మికుల హక్కుల కోసం, భూమి కోసం, భుక్తి కోసం చేసిన అనేక పోరాటాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పాత్ర ఎనలేనిదని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య పేర్కొన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తుర్కయంజాల్‌లో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించే శక్తి కేవలం ఎర్ర జెండాకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పి.శివకుమార్, నాయకులు రాజు, అనురాధ, విజయ, శివకుమార్, భాస్కర్, సుందరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు



సాయిబాబా ఆలయ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో మంగళవారం శ్రీ దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దత్త జయంతి సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ కాంతులు, పచ్చనిఆకులు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ఉదయం శ్రీ షిరిడి సాయిబాబా, దత్తాత్రేయులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణపతిపూజ, దత్తాత్రేయ హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు పాలాది ఆంజనేయులు, పాపిశెట్టి రాము, కుమారస్వామి, ఉప్పల రాములు, రంజిత్‌పాండే, సన్యాసినాయుడు, నయనాచారి, శ్వేత, కళ్యాణి, కౌసల్య పాల్గొన్నారు.

'అసమానత వ్యతిరేక' సాహిత్యం ఆవిష్కరణ

మాడ్గుల: అసమానత వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో జైభారత్ ఆధ్వర్యంలో అసమానత దినం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మనుస్మృతిలో అసమానతలను దగ్ధం చేసిన స్ఫూర్తిని ముందుకు తీసుకుపోతూ.. మతాల్లోని అసమానతలను, వివక్షలను ప్రోత్సహించే అంశాలను దహనం చేయడం జరిగిందన్నారు. మత గ్రంథాల్లో ఉన్న అసమానతలు తగలబెట్టే కార్యక్రమం డిసెంబర్ 26న నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జై భారత్ నాయకుల చేతుల మీదుగా అసమానత వ్యతిరేక సాహిత్యాన్ని ఆవిష్కరణ చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జై భారత్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లావణ్య, శ్రీశైలం, మనీషా, పూజా, మహేష్, మానస, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జైభారత్ సభ్యులు

మద్యం దుకాణాన్ని తొలగించాలని వినతి

హస్తినాపురం: నిబంధనలను విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుపుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ రహదారిపై ఏర్పాటు చేసిన మద్యం దుకాణం నిర్వాహకుడు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాడని, ఈ దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఎక్సైజ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం హస్తినాపురంలో విలేకరులతో మాట్లాడుతూ, సరూర్‌నగర్ డీపీఈఓ అండదండలతో ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా బార్లను తలదన్నే విధంగా హస్తినాపురం చౌరస్తా దగ్గర సాగర్ రహదారిపై వైన్‌షాపు ఏర్పాటు చేశారని, వెంటనే దానిని తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని శ్రీనివాసులు హెచ్చరించారు. సమావేశంలో ఆర్.లింగస్వామి, అన్నపోసల వెంకటేశ్, పోలే విష్ణు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నోజు శ్రీనివాసులు

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి అన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ఆయన కమలానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కాలనీ సమీపంలో ఉన్న వనస్థలిపురం రైతుబజారు కూడలిలో నిత్యం ట్రాఫిక్‌జాంలు ఏర్పడుతూ కాలనీలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కాలనీలోని సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుబజారు వద్ద వ్యాపారాలు చేసుకునేవారు, కాలనీవాసులను సమావేశ పరిచి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాజ్‌కిరణ్ రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, మల్లీశ్వరిరెడ్డి, మల్లేష్, శ్రావణ్‌కుమార్, సత్తిరెడ్డి, సుబ్బారావు, టీవీ రావు, భారత్‌సింగ్, జ్యోతిరెడ్డి, సత్యనారాయణ, గణేష్, అచ్యుత్, రామారావు, నాగమల్లేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి పడిపూజ

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ భక్తమార్కండేయస్వామి దేవాలయంలో ఈ నెల 27న శ్రీ అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మసున మురళీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పడిపూజ కార్యక్రమానికి అయ్యప్పస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

అర్హులకు గ్యారంటీ పథకాలు

తలకొండపల్లి: మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 28న ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత బోళ్ళ యాదగిరి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందన్నారు. జనవరి 6 వరకు కార్యక్రమం కొనసాగుతుందని, గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ఎంపిక చేయబడిన వారికి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండలంలోని రాంపూర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొసాగుతున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం నాల్గొవ రోజుకు చేరుకున్నాయి. అర్చకులు అభిషేకం, అఖండ దీపారాధన, వేద పఠనం, భగవద్గీత సంకీర్తనలు, భజనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, ఈఓ స్నేహలత, క్లర్క్ ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన గోలి



మాజీ మంత్రిని కలిసిన శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: మాజీ మంత్రి హరీశ్‌రావును మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుభాశ్ ఉన్నారు.

వైద్య శిబిరాలతో మేలు

వనస్థలిపురం: ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ డీసీసీ సాయిశ్రీ అన్నారు. మంగళవారం వనస్థలిపురంలో రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో కామినేని, తేజస్విని ఆసుపత్రుల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వృద్ధులకు బీపీ, షుగర్, తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గద్దె విజయ్‌నేత, డా.మీర్యాంబాబు, డా.ఆర్. రామ్మూర్తి, ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు శంకర్, శివ, ఉపేందర్‌రెడ్డి, శ్రీను, మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

28న బీజేపీ సన్నాహక సభ

బడంగ్‌పేట్: కొంగరకలాన్‌లోని శ్లోక కన్వెన్షన్ హాల్‌లో 28న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభకు ముఖ్యఅతిథిగా అమిత్‌షా రాబోతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బాలాపూర్‌లో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో స్వల్ప తేడాతో బీజేపీ ఓటమి చెందినప్పటికి నైతిక విజయం సాధించిందని అన్నారు. ఈ సారి లక్ష ఓట్లు పడటం చాలా సంతోషమన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అమిత్‌షాతో పాటు బీజేపీ జాతీయ నాయకులు సంతోష్, డా.లక్ష్మణ్, డీకే అరుణ, బండి సంజయ్ పా ల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రవాస భారతీయుడు

కడ్తాల్: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రవాస భారతీయుడు, మండలానికి చెందిన గూడూరు కిశోర్‌రెడ్డి, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అమెరికా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను కిషోర్‌రెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. ఆట బృందం ఆధ్వర్యంలో తెలంగాణలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహణకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 29న కడ్తాల్ మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు.



ఎమ్మెల్యేను కలిసిన కిశోర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

రేపటి నుంచి ప్రజాపాలన సదస్సులు

కడ్తాల్: ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు చేపట్టిన ప్రజాపాలన సదస్సులు 28 నుంచి జనవరి 4 వరకు, మండల పరిధిలోని గ్రామాల్లో రోజువారీగా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 1.మహాలక్ష్మి 2. రైతు భరోసా 3. గృహజ్యోతి 4.ఇందిరమ్మ ఇళ్ల 5.చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 28వ తేదీ ఉదయం రావిచేడ్, మక్తమాధారం, మధ్యాహ్నం న్యామతాపూర్, రేఖ్యతండా 29న ఉదయం చల్లంపల్లి, అన్మాస్‌పల్లి, మధ్యాహ్నం సాలార్‌పూర్, గానుగుమార్ల తండా, 30న ఉదయం మైసిగండి, గడ్డమీదితండా, మధ్యాహ్నం పేద్దావేములోని బావితండా, గోవిందాయిపల్లి తండా, జనవరి 02న ఉదయం కర్కల్‌పహాడ్, వాస్‌దేవ్‌పూర్, మధ్యాహ్నం నార్లకుంట, బాలాజీనగర్, 03న ఉదయం ఎక్వాయిపల్లి ముద్వీన్, మధ్యాహ్నం గోవిందాయిపల్లి, మర్రిపల్లి, 04వ తేదీ ఉదయం చరికొండ, కడ్తాల్, మధ్యాహ్నం పల్లె చెలకతండా, కొండ్రిగానిబోడ్ తండాల్లో సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సదస్సులు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రైతు రుణమాఫీ అమలు చేయాలి



రైతులకు సభ్యత్వాలు అందజేస్తున్న నేతలు

- రైతు సంఘం మండల కార్యదర్శి ముసలయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి చీమల ముసలయ్య, అధ్యక్షుడు రామకృష్ణారెడ్డిలు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్ గూడలో రైతు సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం రైతులకు సభ్యత్వాలను అందజేశారు. ముఖ్యఅతిథులుగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు.అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు తులసిగారి నర్సింహా, పటేల్‌గూడ అధ్యక్షుడు శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

మహాయజ్ఞం పరిసమాప్తం

అబ్దుల్లాపూర్‌మెట్ : విశ్వశాంతి శ్రేయస్సును కోరుతూ మండలం పిగ్లీపూర్ శివారులోని దేశముఖిలో గల మౌంట్ శంబళ ది గ్లోబల్ శక్తి కేంద్రంలో ప్రతి సంవత్సరం దత్త పౌర్ణిమి రోజున నిర్వహించే శ్రీ రాజసూయ గాయత్రీ మహాయజ్ఞం మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా కాశీ నుంచి విచ్చేసిన శ్రీ సత్యానందస్వామి పర్యవేక్షణలో కార్యక్రమంలో భాగంగా దత్తపూర్ణిమ రోజున ప్రత్యేక సామూహిక దీపయజ్ఞం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాజసూయ యజ్ఞంలో భాగంగా పంచ వీరభద్ర యూనివర్సిటీ ఐదవ స్నాతకోత్సవం నిర్వహించి విద్యార్థులకు పట్టాలు అందజేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సాధకులు, భక్తులు పాల్గొన్నారు.



మహాయజ్ఞంలో పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

ముగిసిన వేదాంత జ్ఞాన మహాసభలు




విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని సద్గురు శ్రీ నిత్య శుద్దానందస్వామి క్షేత్రంలోని శ్రీరామదూత ఆశ్రమంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రథమ అర్షవేదాంత జ్ఞాన మహాసభలు మంగళవారం ముగిశాయి. అర్షవేదాంత జ్ఞాన మహాసభల్లో భాగంగా ఉదయం సుప్రభాత మేలుకొలుపు, భగవద్గీత తృతీయ షట్క పారాయణం, సద్గురు దేవతార్చనలు, విష్ణు సహస్రనామ మహాయజ్ఞం నిర్వహించారు. మహాసభల్లో ముఖ్యఅతిథిగా శ్రీయజ్ఞపల్క్య ఆశ్రమం పీఠాధిపతి పర విద్యానందగిరి మాతాజీ, సర్వేశ్వరానందగిరిస్వామి, సుదానందగిరిస్వామి, పరబ్రహ్మానందగిరి మాతాజీ, పరమేశ్వరానందగిరి మాతాజీ, లక్ష్మణానంద గిరిస్వామి, రామానందగిరిస్వామి, వేదానందగిరిస్వామి తదితరులు సందేశాలు ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన పీఠాధిపతులకు శ్రీ రామదూత ఆశ్రమ సంస్థాపకులు శివానందస్వామి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు వీరబ్రహ్మం రామ్మోహన్, చంద్రశేఖర్, నర్సింహా, లక్ష్మయ్య, యాదయ్య, బిచ్చయ్య, సంపత్‌కుమార్, శ్రీనివాసులు, లక్ష్మణ్‌గుప్తా, కృష్ణయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

వామ్మో వానరాలు!

- ఇళ్లు, పొలాల్లో హడలెత్తిస్తున్న కోతులు
- చిన్నారులు, మహిళలపై దాడులకు తెగబడుతున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కందుకూరు చౌరస్తా పక్కన వీధిలో సంచరిస్తున్న కోతులు

కందుకూరు: కోతులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. విచ్చలవిడి సంచారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇళ్లు, దేవాలయాలు... ఎక్కడ చూసినా కోతుల బెడదతో హడలెత్తిపోతున్నారు. పంట పొలాలను వదలడం లేదు. ఒంటరిగా వెళ్తున్న మహిళలు, చిన్నారులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఇళ్లల్లోకి వెళ్లి వస్తువులను చిందరవందరగా పడేస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యగా తయారైంది.

ఆహారం లభించక

అడవుల్లో ఆహారం లభించక కోతులు ఊర్ల మీదకు వచ్చి జీవిస్తున్నాయి. కందుకూరు, కందుకూరు చౌరస్తా, కొత్తగూడ, రాచులూరు, చీమలవానికుంట, తిమ్మాపూర్, బైరాగిగూడ, తుర్కగూడ, ఆకుల మైలారం, మాలగూడ, మీర్‌ఖాన్‌పేట, సాయిరెడ్డి గూడ, ముచ్చర్ల, ఊట్లపల్లి, పోచమ్మగడ్డ తండా తదితర గ్రామాల్లోకి కోతులు పెద్ద ఎత్తున సంచరిస్తున్నాయి. కొన్నేళ్లుగా ఇక్కడే స్థిరంగా ఉంటున్నాయి. ఇళ్లు, కార్యాలయాలు, దేవాలయాలు, రోడ్లు ఎక్కడ పడితే అక్కడే సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కనీసం దేవాలయాల్లో ప్రశాంతంగా పూజలు కూడా చేసుకోలేని దుస్థితి నెలకొంది. మరోపక్క ఇళ్లపై తిరుగుతూ మహిళలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇప్పటికే పలువురు గాయాలపాలయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఒంటరిగా చిన్నారులను బయటకు పంపించలేని పరిస్థితి నెలకొంది. సాయిరెడ్డి గూడ, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల తదితర గ్రామాల పరిధిలో పంట పొలాలలో సంచరిస్తూ పంటలను తింటూ రైతులను నష్టపరుస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కోతులను పట్టుకుని అడవుల్లోకి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.